భూమిలో రాళ్లు పాతుతున్న వ్యక్తులను అడ్డుకుంటున్న మహిళా రైతులు

అభివృద్ధిలో పరిశ్రమల స్థాపన కీలకం

డిఐపిసి సమీక్షలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా అభివృద్ధిలో పరిశ్రమల స్థాపన కీలకమని కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ తెలియజేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ (డీఐపీసీ) సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పరిశ్రమల స్థాపన కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన అనుమతి దరఖాస్తులను సమీక్షించి, వాటికి సంబంధిత శాఖలు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సమావేశంలో కుదిరిన ఒప్పందాల అమలుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 12 సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. వీటి ద్వారా రూ.6,175 కోట్ల పెట్టుబడులతో 13,426 మందికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ పరిశ్రమలకు అవసరమైన 3,835 ఎకరాల భూమి కేటాయింపులు, ఇతర అనుమతులను వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న రాంప్ అవగాహన కార్యక్రమాల్లో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పీఎంఈజీపీ, విశ్వకర్మ కార్యక్రమాల అమలును పటిష్టంగా చేపట్టాలని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ఐడిపి పథకం కింద 10 యూనిట్లకు సంబంధించిన పెట్టుబడి రాయితీని వెంటనే మంజూరు చేయాలన్నారు. హిందూపురం పారిశ్రామిక వాడలో కాలుష్య నియంత్రణకు సంబంధించి తగిన చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలోని ప్రమాదకర పరిశ్రమలను గుర్తించి తనిఖీలు నిర్వహించి మార్గదర్శకాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, డీఆర్డీఏ పీడీ నరసయ్యతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న మహిళా రైతులపై దాడి

ప్రజాశక్తి-పరిగి

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ రైతు

మండలంలోని బీచిగానిపల్లిలో శీగిపల్లి గ్రామ రైతులపై మరోమారు దాడి జరిగింది. గత కొంతకాలంగా ఈ భూ వ్యవహారంపై వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో టిడిపి నాయకుడిగా చలామణి అవుతున్న వంగలపల్లి శంకర్ రెడ్డి తన అనుచరులతో భూములను ఆక్రమించుకుని తమపై బుధవారం నాడు దాడి చేశారంటూ మహిళా రైతులు తెలియజేశారు. వారి తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శీగిపల్లి గ్రామానికి చెందిన 8 కుటుంబాలు 41 మంది జనాభా వ్యవసాయం, వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి తాత బోయ వన్నపల్లి హనుమంతప్ప, అదే గ్రామానికి చెందిన ఉప్పర హనుమంతప్ప అలియాస్ కుంటేప్ప బీచిగానిపల్లి గ్రామ పొలం సర్వే నంబర్లు 171-2లో 11.72 ఎకరాలు, 172లో 26.38 ఎకరాల భూమిని సరిభాగంగా కొనుగోలు చేశారు. వీరికి రావాల్సిన సగభాగాన్ని కొంతమంది కబ్జాకు గురైంది. అనుభవంలో ఉన్న 8 కుటుంబాల రైతులే సాగులో ఉన్నారు. భూమికి ఎలాంటి సంబంధం లేని శంకర్ రెడ్డి మరి కొంతమంది రియల్టర్లు తప్పుడు విక్రయ అగ్రిమెంట్లు వేసి బుధవారం నాడు పొలంలోకి ప్రవేశించారు. వ్యవసాయ పనులు చేస్తున్న మహిళా రైతులపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు దాడికి పాల్పడ్డారు. ఈ భూమి తాము కొన్నామని ఖాళీ చేయండి అంటూ మహిళా రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. అడ్డుకున్న మహిళలపై ఇనుప రాడ్లు, గడ్డపారలు ఇతర మారణాయుధాలతో బెదిరించారు. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని పొలంలోకి ప్రవేశించిన రియల్టర్లను అక్కడి నుంచి పంపించేశారు. దాడిలో గాయపడిన మహిళా రైతులు రూప, సునీత, లక్ష్మమ్మ, రూప మారుతి, గంగమ్మలను చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తమను బెదిరించి భూమిని లాక్కోవాలని కొందరు చూస్తున్నారని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని మహిళలు కోరారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న

ప్రజాశక్తి - తాడిమర్రి

అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. మండలంలోని షిర్డీ సాయి దేవాలయం సమీపంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతుల సమస్యలు పట్టించుకోకపోతే పతనం తప్పదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం రైతుసంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘం అధ్యక్షులుగా బాలం రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అర్వేటి కాటమయ్య, కోశాధికారిగా వడ్డీ రామలింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా గద్దె కృష్ణారెడ్డి, సాకే నరసింహులు, కోడి మూర్తి, ఓబుళపతి, సహాయ కార్యదర్శిగా కోవూరు శంకర్ రెడ్డి, అర్వేటిగంగాధర్, ఎర్ర గంగుశేషాద్రి నాయుడు, మీసాల రామకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు, వీరితోపాటు ముసుగు శంకర్‌తో పాటు 28 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఐక్యతను చాటుతున్న నాయకులు, రైతులు

ప్రజాశక్తి క్యాలెండర్ డైరీలను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, తదితరులు

ప్రజల పక్షపాతి ప్రజాశక్తి

2026 క్యాలెండర్, డైరీల ఆవిష్కరణలో మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రజల పక్షపాతి ప్రజాశక్తి దినపత్రిక అని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో 2026 ప్రజాశక్తి క్యాలెండర్, డైరీలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం కార్మిక, కర్షక, ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ వాటి పరిష్కారానికి ప్రజాశక్తి కృషి చేస్తోందన్నారు. ప్రజాశక్తి భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షులు పోతిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ దండు ఈశ్వర ప్రసాద్, నాయకులు సోమశేఖర్ నాయుడు, సాయి ప్రసాద్, ప్రజాశక్తి సర్క్యులేషన్ ఇంచార్జ్ నాగార్జున, రిపోర్టర్ ప్రకాష్ గౌడ్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-సోమందేపల్లి



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

స్థానిక అంబా భవానీ దేవాలయంలో బుధవారం ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెనుకొండ నియోజకవర్గ అధ్యక్షులుగా బాబాఫకృద్దీన్, ఉపాధ్యక్షులుగా నందినిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, గౌరవాధ్యక్షులు రవిచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారధులు జర్నలిస్టులని అన్నారు. సమాజం కోసం పని చేసే ప్రతి జర్నలిస్టుకు సమస్యలు ఉంటాయని,వాటిని కమిటీ ద్వారా పరిష్కరించుకుందామని అనాన్రు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తోటి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ అధ్యక్షులు బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా పెనుకొండ నియోజకవర్గ కార్యదర్శులుగా గోరంట్ల అంబే వెంకటేష్, జగదీష్, రొద్దం కిష్టప్ప, గోరంట్ల మహేష్‌ను ఎన్నుకున్నారు. పెనుకొండ మండల అధ్యక్షులుగా మహేష్, ఉపాధ్యక్షులుగా వడ్డే శ్రీనివాసులును ఎన్నుకున్నారు. సోమందేపల్లి మండల అధ్యక్షుడిగా సుధీర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, కార్యదర్శులుగా ఆదినారాయణ, బెస్త శ్రీనివాసులు,లీగల్ పాయింట్ మధు, మనోహర్, సాయిప్రసాద్‌ను ఎంపిక చేశారు. రొద్దం మండల అధ్యక్షులుగా ఈడిగ నవీన్, కుమార్‌నిఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర, చరణ్, నరసింహ, కుమారు, నాగరాజు, హరికృష్ణ, శివ, శ్రీనివాసులు, వేణు, మారుతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్ రాజుకు ఘనస్వాగతం

సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెస్ రాజు

ప్రజాశక్తి మడకశిర టౌన్

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఎంపికై మొట్టమొదటిసారిగా మడకశిరకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ ఊరేగింపుతో వచ్చిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు వాల్మీకి సర్కిల్లో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెస్ రాజు వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అంబేద్కర్ ఎన్టీరామారావు విగ్రహాలకు పూలమాల వేశారు అనంతరం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందన సభలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలో ఎంపీలు ఎమ్మెల్యేలు మంత్రులను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో వందశాతం గెలుపును సాధించి జిల్లాలో తెలుగుదేశం జెండాను రెపరెపలా లాడిస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు ప్రజల తరపున పోరాటం చేయాల్సింది పోయి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే ఎవరు భయపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెప్మా మహిళా గ్రూపు సభ్యులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మెప్మా గ్రూపు సభ్యులకు 'సఖి సురక్ష' కార్యక్రమం ప్రారంభిస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాదున్నీసా తెలిపారు. మహిళా గ్రూప్ సభ్యులు 30 సంవత్సరాలు పైబడిన వారు అనారోగ్యం పాలు కాకూడదని, వారు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందనే ఆలోచనతో వారికి ఉచితంగా 5 లక్షల రూపాయల వరకు వారి ఆరోగ్యం రక్షించే కార్యక్రమంలో భాగంగా ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. పరీక్షల అనంతరం వ్యాధి నిర్ధారణ చేసి తగిన చికిత్సల కోసం పేరుగాంచిన ఆసుపత్రులకు సిఫార్సు చేసి వారి ఆరోగ్యం కోసం రూ. 5 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చు చేస్తుందని, మహిళా గ్రూప్ సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సి ఎ ఇస్మాయిల్, బండారు మురళి,ఓం ప్రకాష్, బొబ్బిలి రవి, పాశం రమణా నాయుడు, కదిరి మున్సిపల్ మెప్మా టిఎంసి శివ కుమార్, సిఒలు గిరి, కృష్ణమూర్తి, మురళి, ఆంజనేయులు,మెప్మా సంఘ నాయకులు నీరజ, ఉమాదేవి, ఫరీదా, మహిళా ఆర్పీలు, గ్రూపు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కొనుగోలులో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పెనుకొండ

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ హరీష్ బాబు

వస్తువుల కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.హరీష్ బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో వినియోగ దారుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కల్తీయుగం లో వినియోగ దారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి నారాయణ మాట్లాడుతూ వస్తు వినియోగం లో మోసానికి గురైనపుడు వినియోగ దారుల ఫోరంను ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కాంతారావు,రామన్న,సంజీవ రెడ్డి, విష్ణు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలకు నిధుల సేకరణ

ప్రజాశక్తి - పరిగి

ఈనెల 31నుండి జనవరి 4 వరకు సిఐటియు ఆధ్వర్యంలో విశాఖపట్నం కేంద్రంగా నిర్వహించే అఖిలభారత సిఐటియు మహాసభలకు సహాయనిధి సేకరించే కార్యక్రమాన్ని నాయకులు బుధవారం చేపట్టారు. మండల కేంద్రంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరిగి బస్టాండ్,ప్రభుత్వ కార్యాలయాలు, పరిగి, కాలుపల్లి గార్మెంట్స్ ప్రాంతాలలో సహాయ నిధి సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన తర్వాత మొదటిసారిగా అఖిలభారత మహాసభలు ఆంధ్రప్రదేశ్లో జరగడం గర్వకారణం అన్నారు. దేశవ్యాప్తంగా ఎంతోమంది మేధావులు కార్మిక సంఘాల నాయకులు తరలివస్తున్న ఈ కార్యక్రమానికి వ్యాప్తంగా ప్రతి కార్మికుడు శ్రామికుడుతరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జివిఎల్ నరసింహులు, రాము, ఇస్మాయిల్, రమణ, రామాంజి, సరస్వతమ్మ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

సహాయ నిధికి నగదు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

27న హిందూపురంలో వందే భారత్ రైలు ప్రారంభం

హాజరుకానున్న కేంద్ర రైల్వే మంత్రి సోమన్న

ప్రజాశక్తి-హిందూపురం

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ పార్థ సారథి

ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో భాగంగా హిందూపురం నుండి కాచిగూడకు వందే భారత్ రైలును ఈనెల 27న ప్రారంభిస్తున్నట్లు హిందూపురం ఎంపీ బి.కె పార్థసారథి తెలిపారు. ఈ నెల 27వ తేదీన కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న సమక్షంలో సంబంధిత రైలును ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగాఅందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీ స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. స్థానిక రైల్వే స్టేషన్ లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి రైల్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రయాణికులకు తాగునీటి సమస్య ఇబ్బందిగా ఉందని తెలపడంతో వెంటనే స్పందించిన ఎంపీ పార్థసారథి ఎంపీ నిధుల ద్వారా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అడిగిన వెంటనే వందే భారత్ రైలు ఆగడానికి సహకరించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి, అధికారులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ కేంద్రమైన హిందూపురాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, పట్టణ టిడిపి అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ కమిటీలో పలువురికి చోటు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు కమిటీలో పుట్టపర్తి కి చెందిన పలువురు తెలుగుదేశం నాయకులకు చోటు లభించింది. పుట్టపర్తి మండల నాయకులు రాసింపల్లి శ్రీరామ్ రెడ్డికి జిల్లా ఉపాధ్యక్ష పదవి రాగా ఆఫీస్ సెక్రటరీగా అంబులెన్స్ రమేష్ , జిల్లా ఉపాధ్యక్షులుగా రాసింపల్లి శ్రీరాంరెడ్డి, అధికార ప్రతినిధిగా సోమశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కే గంగాధర్, మీడియో కోఆర్డినేటర్‌గా మణి కుమారిని నియమించారు. ఈ మేరకు ఆయా సభ్యులనుకమిటీలో చేర్చినట్లు ఉత్తర్వులు అందాయిజ పార్లమెంట్ ఆఫీస్ సెక్రటరీగా ఎంపికైన పుట్టపర్తి అంబులెన్స్ రమేష్ గతంలో సిబిఎన్ ఆర్మీ లో నియోజకవర్గ అధ్యక్షునిగా ఐ టీడీపీ నియోజకవర్గ అధ్యక్షునిగా, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేశారు. 20 సంవత్సరాల నుండి పార్టీపై అతను చూపిన చొరవ, పార్టీ అభివృద్ధికి చేసిన కృషి తదితర విషయాలను దృష్టిలో ఉంచుకొని తనకు ఈ పదవి అప్పజెప్పిన రాష్ట్ర, జిల్లా,నియోజకవర్గ నాయకుల అంబులెన్స్ రమేష్ ధన్యవాదాలు తెలిపారు. అంతేకాక తన ఎంపికకు కృషిచేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు ఎమ్మెస్ రాజుకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఎంపికైన నాయకులకు, పుట్టపర్తి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

క్రీడాకారులతో ఉపాధ్యాయులు

క్రీడా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో బుధవారం ప్రిన్సిపల్ ఎం.ఎస్ కిరణ్ చేతులమీదుగా గోల్ షాట్ బాల్ క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చిలో ఈనెల 25 నుండి 29వ తేదీ వరకు జరిగే ఫెడరేషన్ కప్ గోల్ షాట్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు పాల్గొంటుందని ఆయన తెలిపారు. అందులో భాగంగా హరీష్ పాఠశాలలో కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేసి క్రీడాకారులకు కిట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడలో ప్రతిభకనబరచి విజయంతో తిరిగిరావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇండియన్ గోల్ షాట్ బాల్ జనరల్ సెక్రటరీలు రాజేంద్రనాథ్, మనోహర్ రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి ప్రసన్న కుమార్, జాయింట్ సెక్రటరీ రామాంజుల రెడ్డి, అసోసియేషన్ సభ్యులు జగదీష్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రియులకు అవార్డు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ శ్రీ కోదండరెడ్డి చేతుల మీదుగా 'పుడమిపుత్ర' అవార్డు ను పర్యావరణ ప్రియుడు ఆదినారాయణ, శ్యామల అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు, రైతులకు ప్రకృతి వ్యవసాయం మీద అవగాహన కల్పించే వ్యక్తులకు, సంస్థలకు ప్రతి సంవత్సరం ఈ పుడమి పుత్ర అవార్డు లను గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్ రెడ్డి ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రతి జిల్లాకు ఒకరిని ఎంపిక చేసి గత 3 సంవత్సరాలనుండి ఈ అవార్డు ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో అవార్డు లు అందుకున్న ప్రతి రైతుదంపతులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం తో పాటు దంపతులిద్దరికీ నూతన వస్త్రాలు బహుకరించారు. రైతులకు ఎన్నో సేవలు అందించి పర్యావరణ ప్రియుడుగా పేరు పొందిన ఆదినారాయణ కుటుంబాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

మడకశిరలో ధ్వనికాలుష్యం

ప్రజాశక్తి మడకశిర రూరల్

పట్టణాలలో విచ్చలవిడిగా డీజే సౌండ్ సిస్టం తో పాటలు పెట్టడంతో విపరీతమైన శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది దీంతో పట్టణవాసులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు, వృద్ధులు, చిన్నపిల్లలు, హృద్రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు అనేకమార్లు ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి డీజే సౌండ్ సిస్టం ను నిర్దిష్టమైన ప్రాంతాలకు మాత్రమే అనుమతి ఇవ్వాలని కోరారు. ది కానీ ఎవరు కూడా స్పందించలేదు. డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకునేవారు వారికి అవసరం ఉన్న చోట మాత్రమే ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

సామాజిక తనిఖీ ప్రారంభం

ప్రజాశక్తి - అమరాపురం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో భాగంగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ 19 వ సామాజిక తనిఖీ ప్రారంభమైందని ఎంపిడిఓ ఎంపీడీవో రామారావు, ఏపీవో శివన్న తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండలంలో మొత్తం పనుల సంఖ్య 805 ఉన్నాయన్నారు. ఈ పనులకు గాను 7.11 కోట్లు, ఉపాధి హామీ శ్రామికుల వేతనం 5.29 కోట్లు, పనులకు గాను మెటీరియల్ ఖర్చు 1.89 కోట్లు ఉన్నాయన్నారు. ఈ ఖర్చులపై 19వ సామాజిక తనిఖీ చేయుట అన్ని గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలలో పనుల పరిశీలన, వేతన పరిశీలన ప్రక్రియ ప్రారంభమైనట్లు మండల పరిషత్ ఎంపీడీవో రామారావు తెలిపారు. సామాజిక తనిఖీ చేయు కార్యక్రమంలో ఉపాధి హామీ లబ్ధి పొందిన ఆర్టికల్చర్ రైతులు గాని ఉపాధి హామీ శ్రామికులు తదితరులు సహకరించాలని వారు సూచించారు.

నీటి సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ వ్యాప్తంగా నీటి సరఫరా లో రెండు రోజులపాటు అంతరాయం ఏర్పడినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఈ విషయంపై ఆయన బుధవారం మాట్లాడుతూ, గొల్లపల్లి రిజర్వాయర్ నుండి హిందూపురం పట్టణానికి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కియా పరిశ్రమ వద్ద పైప్ లైన్ మరమ్మతులు ఏర్పడడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు ఉన్న నీటిని పొదుపుగా వాడుకొని పురపాలక సంఘ అధికారులకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రం లోని ప్రభుత్వాసుపత్రిని డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డిఐఒ) సురేష్ బాబు బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మెడిసిన్ రికార్డులను పరిశీలించారు.. స్టాక్ స్టేట్మెంట్ ప్రకారం అందుతున్న మందులు, వాటి వినియోగ ప్రతులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అలాగే అందుబాటులో లేని మెడిసిన్ కి సంబంధించి డిమాండ్ స్టాక్ లో పొందు పరచాలని తెలిపారు. తనిఖీలో భాగంగా ముదిగుబ్బ సచివాలయం 4 ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేంద్ర, సిహెచ్ఒలు సరస్వతమ్మ, వన్నప్ప, లలితమ్మ, సూపర్వైజర్ పార్వతమ్మ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

పేదల ప్రాణ రక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి అండ అని రాష్ట్ర బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన 53 పేద, నిరుపేద కుటుంబాలకు మంజూరైన రూ.30 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పే దల జీవితాలకు సంజీవనిగా మారిందన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఈ నిధి ప్రాణరక్షణగా నిలుస్తోందని అన్నారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ,కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, సింగిల్ విండో అధ్యక్షులు పోతిరెడ్డి, మండల కన్వీనర్ దండు ఈశ్వర ప్రసాద్, త్రివేంద్రనాయుడు, షౌకత్, సమి,సిద్ధయ్య, రమణమ్మ, చంద్ర కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులతో మంత్రి సవిత

మంత్రి సవితతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి

ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలివ్వండి : సిపిఎం

ప్రజాశక్తి-పెనుకొండ

ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రి సవితకు బుధవారం అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి మాట్లాడుతూ పెనుకొండ పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలు మూడేళ్ళ గా పోరాటం చేస్తున్నారన్నారు. పట్టణ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నారని అధికారులు ఆ గుడిసెలు తొలగించి పేదలకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. రెవెన్యూ అధికారులతో చర్చించి పేదలకు న్యాయం జరిగే విధంగా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వెంకట రాముడు, అర్చన, గంగమ్మ, కొల్లమ్మ, నాగమణి, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి విజయకేతనం

ప్రజాశక్తి - కదిరి టౌన్

హిందూపురం మహిళల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ఉమ్మడి అనంతపురం జిల్లా రీజినల్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ లో కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థి నక్షత్ర ప్రతిభ కనపర్చింది. 100 మీటర్ల పరుగు పందెంలో నక్షత్ర విజయం సాధించినట్లు ప్రిన్సిపల్ రమా తెలిపారు. పరుగు పందెంలో మొదటి బహుమతి, బ్యాడ్మింటన్ లో మొదటి బహుమతి గెలిచిందన్నారు. మొదటి బహుమతి సాధించిన నక్షత్రను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమతో పాటు అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిషత్ కార్యాలయం లో బుధవారం ఎస్ ఐ నరేంద్ర ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలలోనే సమస్యలను పరిష్కారం చేయవచ్చు అని అన్నారు. అంతే కాకుండా గ్రామాలలో ఫ్లెక్సీ లు ఇతర డిస్ప్లే బోర్డు లకు పంచాయతీల అనుమతి తీసుకొనే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, సచివాలయం డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు రమేష్ బాబు, దుర్గయ్య, సాయి ప్రసాద్, లలితమ్మ, పోలమ్మ, శశికళ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడికి అభినందనలు

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, మడకశిర శాసనసభ్యులు ఎమ్ ఎస్ రాజును బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, బాలాజీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు మడకశిరలో ఎమ్మెస్రాజును కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు, బేకరీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తాజా, మాజీ సభ్యుల సన్మాన కార్యక్రమం

సొసైటీ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి - తలుపుల

తలుపుల సింగల్ విండో అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి పాత కొత్త కమిటీ సభ్యులను స్థానిక సహకార సొసైటీ సంఘం కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ముందుగా టిడిపి మాజీ మండల కన్వీనర్ ముబారక్ కో కన్వీనర్ రాజారెడ్డి జనరల్ సెక్రెటరీ శ్రీనివాసులకు ఘనంగా సన్మానించారు అదేవిధంగా నూతన కమిటీ మండల కన్వీనర్ మేడ శంకర్ కో కన్వీనర్ భార్గవ్ రెడ్డి జనరల్ సెక్రెటరీ కొమ్మెర కృష్ణను పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తలుపులు మండల కన్వీనర్ మేడ శంకర్ కో కన్వీనర్ వీరభద్ర రెడ్డి జనరల్ సెక్రెటరీ కృష్ణ, మాజీ మండల కన్వీనర్ ముబారక్, మాజీ కో కన్వీనర్ రాజారెడ్డి, జనరల్ సెక్రెటరీ జయచంద్ర, సింగల్ విండో అధ్యక్షులు ఓబుల్ రెడ్డి, జయరాంశెట్టి, సుదర్శన్, అక్బర్, గంగరాజు, వెంకటేష్, చౌడయ్య, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయుల కొరతగా ఉన్న పాఠశాలల్లో అకాడమిక్ ఇన్ స్ట్రక్టర్ల నియామకానికి ఇటీవల విద్యాశాఖ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ మేరకు హిందూపురం మండలానికి 14 మందిని నియమించారు. వారు బుధవారం ఆయా ప్రాంతాల్లో విధుల్లోకి చేరారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి విడుదలైన నియామక ఉత్తర్వుల మేరకు అభ్యర్థులకు మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్న లక్ష్మి లకు జాయినింగ్ రిపోర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ అకాడమిక్ ఇన్ స్ట్రక్టర్లు మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యా బోధన చేస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కేటాయించిన పాఠశాలల్లో ఆయా అకాడమిక్ ఇన్ స్ట్రక్టర్లు పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

26న వికలాంగుల ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలోని వికలాంగుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈనెల 26న ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టర్ కార్యాలయంలోని సంబంధిత విభాగాల అధికారులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.. ఈ మేరకు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు జి. అర్చనకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇకపై ప్రతి నెల నాలుగవ శుక్రవారం ఈ ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తారని, జిల్లాలోని వికలాంగులు తమకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు, పెన్షన్లు, పునరావాసం, ఉపాధి, విద్య, ఆరోగ్యం, సహాయక పరికరాలు తదితర అంశాలపై తమ వినతులను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొని వికలాంగుల ఫిర్యాదులను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు అనుసరించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని కదిరి ఏడి ఏ సనావుల్లా అన్నారు. బుధవారం మండల పరిధిలోని కట్టారుపల్లి సచివాలయంలో రైతు సేవ కేంద్రంలో రైతులతో వ్యవసాయ అధికారి సయ్యద్ షాదాబ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎడిఎ మాట్లాడుతూ రబీలో పంటసాగు సమయంలో విత్తన శుద్ధి తప్పనిసరి అన్నారు. అలాగే పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.



ఎంపీని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

కళ్యాణ మండపం అభివృద్ధికి ఎంపీ నిధులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

గోరంట్ల మండల కేంద్రంలో యాదవ కళ్యాణ మండప అభివృద్ధికి ఎంపీ నిధుల కింద రూ. 90 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ పార్థసారధి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర యాదవ సంఘం కార్యదర్శి కొత్తపల్లి నరసింహప్ప, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు లక్ష్మి నరసప్ప యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య ఆధ్వర్యంలో గోరంట్ల మండల యాదవ కులస్తులు పెనుకొండ పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికే పార్థసారథిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా యాదవ కళ్యాణమంటపానికి నిధులు కేటాయించాలని ఎంపీని కోరగా స్పందించిన ఆయన ఎంపీ నిధుల నుండి 90 లక్షల రూపాయలు మంజూరు చేస్తానని ప్రకటించారు.అనంతరం యాదవ కులస్తులందరూ కళ్యాణ మండపానికి నిధులు కేటాయించినందుకు పార్లమెంట్ సభ్యులు బి కే పార్థసారథిని అక్కడే ఉన్న టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల యాదవ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని ఓబుల్ రెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ ఇంటిలో గ్యాస్ సిలిండర్నుంచి మంటలు వ్యాపించాయి.అయితే ఇంటిలో ఉన్న ముగ్గురు పిల్లలు తో సహా తల్లి సుబ్బమ్మ సురక్షితంగా బయటపడడంతో బంధువులు గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ కి చెందిన వారు శనివారం సిలిండర్లు డెలివరీ చేశారు. దానిని ఆ కుటుంబ సభ్యులు వాడకుండా శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఆ సిలిండర్ ఓపెన్ చేసి స్టవ్ వెలిగించిన వెంటనే మంటలు ఎగిసిపడడంతో హుటాహుటిన ఇంటిలో ఉన్న తల్లి తన ముగ్గురు పిల్లలతో బయటకు వచ్చింది. గ్యాస్మంటలకు ఇంటిలో ఉన్న సామాగ్రి మొత్తం అగ్నికి ఆహుతి అయింది. విషయం తెలుసుకున్న ఓబుల్ రెడ్డి పల్లి మాజీ సర్పంచి జయరాం బాధితులను పరామర్శించారు. వారికి ఒక ప్యాకెట్ బియ్యం, రూ 5 వేలు నగదు సాయం చేశారు. అదే విధంగా టిడిపి మండల కన్వీనర్ శంకరవీర ప్రసాద్, కో కన్వీనర వీర భార్గవ్ రెడ్డి, మాజీ కన్వీనర్ ముబారక్, మాజీ కార్యదర్శి జయచంద్ర బాధితులకు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

ధ్వంసమైన ఇంటిలోని సామగ్రి

గుండెపోటుతో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - అగళి

మండలంలోని హెచ్చిహళ్లి పంచాయతీ వడ్రహట్టి గ్రామానికి చెందిన శివకుమార్ (32) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. రాయి కొట్టే పని చేస్తూ ఉండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో రాయికొట్టే స్థలంలోని కుప్పకూలిపాడు. స్థానికులు గమనించి అతని ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు శివకుమార్కు భార్య సుప్రీత ఇద్దరు కుమార్తెలు ప్రార్థన బేబీ ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం శివకుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

సిఐకు డీఎస్పీగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని పులిగిండ్లపల్లి గ్రామానికి చెందిన కె. వెంకటప్ప డిఎస్పీగా ప్రమోషన్ పొందారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం వెలువడిన నియామకాల్లో సిఐ నుంచి డిఎస్పీగా పదోన్నతి పొందిన నలుగురిలో సిఐ వెంకటప్ప ఉన్నారు. ఎస్ఐగా1995 లో తన ప్రస్థానం ప్రారంభించి నేడు డిఎస్పీగా వెంకటప్ప ప్రమోషన్ పొందడంతో మండల వాసులు, పులిగిండ్లపల్లి గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, అన్నదమ్ములు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని పిన్నదరి, తాడిమర్రి గ్రామ సచివాలయాలను డివిజనల్ డెవలప్మెంట్ అధికారి జనార్ధన్ రావు బుధవారం తనిఖీ చేశారు. జిఎస్డబ్ల్యూఎస్ ద్వారా జరుగుతున్న వివిధ సర్వేలను సకాలంలో పూర్తి చేసే విధంగా సచివాలయ సిబ్బందికి ఈసందర్భంగా తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో విజయ శేఖర నాయుడు, పంచాయతీ కార్యదర్శులు పరమేశ్వర, రిజ్వానా బేగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) శ్రీసత్యసాయి జిల్లా శాఖ కార్యవర్గం పదవీకాలం పూర్తవడంతో, సంఘం నిబంధనల మేరకు జిల్లా స్థాయి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శ్రీ సత్య సాయి జిల్లా ఎన్నికల అధికారిగా అనంతపురం జిల్లా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు ఆర్.ఎన్. దివాకర్నిఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పారాజు వేంకటేశ్వర్లు నియమించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల అధికారి ఆర్.ఎన్. దివాకర్ ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ శ్రీ సత్య సాయి జిల్లా శాఖ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ను జారీ చేశారు. ఈ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సంఘ నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులు అందరూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు.

ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

డాక్టరేట్ ఇన్ తెలుగు లెక్చరల్ ఆక్టివిటీస్ అవార్డు పొందిన ఎంఇఒ గంగప్పను విద్యార్థి సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఇఒ గంగప్పను పిడిఎస్యు నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సందడి

హిందూపురంలో క్రిస్మస్ వేడుకలు

పరిగిలో కిస్మస్ వేడుకల్లో విద్యార్థులు, తదితరులు

ఓడిసిలో ముస్తాబైన చర్చి

ప్రజాశక్తి -హిందూపురం

పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంటా క్లాజ్ అందరికి బహుమతులను అందించారు. విద్యార్థులు క్రిస్మస్ ప్రత్యేక వేషధారణ, నత్యాలు, ఆటలు, పాటలు పాఠశాల బెలూన్ల అలంకరణ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలను మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూపాఠశాల అంటే లౌకిక రాజ్య సిద్ధాంతాలకు ఆదర్శమని, పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలే దీనికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ట్రెజరర్ డి. ఎస్ నందకుమార్, హెచ్ఎం గాయిత్రి, ఏవో. భాస్కర్, సూపరిటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ఈనెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితమ్మ, రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్. శ్రీసత్యసాయి జిల్లా ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మవరం రూరల్ : స్థానిక ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో కరస్పాండెంట్ ఎస్. చాంద్బాషా ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భగా చిన్నారులు వేషధారణ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ నాగభూషణం, అకాడమిక్ ఇన్ఛార్జి బినోయ్ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు :క్రిస్మస్ సందర్భంగా మండలకేంద్రంలోని సిఅండ్ఐజి మిషన్ చర్చితో పాటు పలు చర్చిలు ముస్తాబయ్యాయి. క్రైస్తవులు తమ ఇళ్లలోనూ క్రిస్మస్ చెట్లు, స్టార్లు, రంగురంగుల కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గురువారం ఉదయం క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సి అండ్ ఐ జి మిషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ జయానందం, కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. క్రిస్మస్ ముందు రోజైన బుధవారం రాత్రి మండల కేంద్రంలోని సి అండ్ ఐ జి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేరల్స్ నిర్వహించారు.

హిందూపురం : పట్టణంలోని లయోలా కళాశాలలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయోలా కళాశాల ఫాదర్ ఆంటోని, సీమోని, రవి, నవీన్, రూరల్ మండల కన్వీనర్ రాము, ఉమామహేశ్వర రెడ్డి, నారాయణ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి:మండల కేంద్రంలోని విశ్వదీప్తి ప్రైవేట్ స్కూల్లో యాజమాన్యం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు శాంతా క్లాజా వేషధారణలో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శాంటా క్లాజ్ వేషధారణలో ఉపాధ్యాయులు చేసిన స్నేహ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవి కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు నాగరాజు, నందిని,ఆశా, మునిరా, కాంతమ్మ, రోజా, నాగమణి, విజయ, జ్యోతి, రూప, ఆర్. నందిని, సురేష్, సుగ్గు సుబ్బయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.